సాక్షి
కుమురం భీం

సోమవారం । 7 ఏప్రిల్ । 2025



లింగాపూర్: మండల కేంద్రంలో ఎడ్లబండిపై శ్రీరాముడి శోభాయాత్ర



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు నిమ్మకంటి సంతోష్‌శర్మ

కల్యాణం.. కమనీయం

- కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం
- రామనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



రెబ్బెన: పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తూ..

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: జగమంతా రామమయంగా మారింది. రామనామ స్మరణ మార్మోగింది. తరలివచ్చిన భక్తకోటి మధ్య రాములోరి కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది.. వివిధ ప్రాంతాల్లోని రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో అర్చకులు నిమ్మకంటి సంతోష్ శర్మ, ఒఝుల శిరీశ్‌శర్మ, ముదిగొండ రాజశేఖర శర్మ, నరేశ్ శర్మ, పూర్ణచందర్ శర్మ, శేఖర్, తిరుపతి చారి, ఢిల్లీ విజయకుమార్ ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని తుజాల్‌పూర్ మురళీగౌడ్ ఇంటి నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలను హనుమాన్ దీక్షాస్వాముల ఆధ్వర్యంలో బ్యాండ్ మేళాలు, భక్తిగీతాలతో గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా జన్కాపూర్ రామాలయం వరకు శోభాయాత్రగా తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సోనేరావు దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, మంగళ సూత్రం, ముత్యాలు సమర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, బుల్లితెర దర్శక, నిర్మాత దండనాయకుల సురేశ్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్లు చిలువేరు వెంకన్న, గాదెవేణి మల్లేశ్, గంధం శ్రీనివాస్, సత్యనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, షామియానాలు నిండిపోయాయి. జన్కాపూర్ నుంచి ఆసిఫాబాద్ పట్టణం వరకు రాష్ట్రీయ రహదారిపై మైకులు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయంలో పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దేగల సత్యనారాయణ, శివచందు, పర్రె గిరిధర్, సీహెచ్ రవి, శైలేందర్, భద్రయ్య, శంకరయ్య, నాగరాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. పట్టణ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



జిల్లా కేంద్రంలో పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పెంచికల్‌పేట్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ విఠల్



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షాపరులు



జిల్లా కేంద్రంలో కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ తెలిపారు. ప్రతిభ చూపిన దీప్తి, కీర్తనను ఆదివారం హైదరాబాద్‌లో నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్యరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శిరీషరాణి, జిల్లా కార్యదర్శి తిరుపతి అభినందించి సత్కరించారు. ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు డెహ్రాడూన్‌లో జరిగిన 38వ నేషనల్ సీనియర్ నెట్‌బాల్ పోటీల్లో దీప్తి రజత పతకం, కీర్తన కాంస్య పతకం సాధించారని అలీబిన్ తెలిపారు. జిల్లాకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

'సన్' డే



ఎండ వేడికి జనాలు లేక వెలవెలబోతున్న కౌటాలలోని కుమురంభీం చౌరస్తా

కౌటాల(సిర్పూర్): ఇటీవల చిరుజల్లులు కురవడంతో జిల్లాలో రెండు, మూడు రోజులపాటు చల్లగా ఉన్న వాతావరణం మళ్లీ వేడెక్కింది. ఉపరితల ద్రోణి ప్రభావం తొలగిపోవడంతో భానుడు తన ప్రభావం చూపుతున్నాడు. ఆదివారం జిల్లాలో ఎండ దంచికొట్టింది. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటాయి. శ్రీరామ నవమి వేడుకలు తిలకించేందుకు వెళ్లిన భక్తులు అవస్థలు పడ్డారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మజ్జిగ, తాగునీటిని సరఫరా చేశాయి. షామియానాలు, పందిర్లు ఏర్పాట్లు చేసినా తిప్పలు తప్పలేదు. ఆదివారం కెరమెరిలో 40.5 డిగ్రీల సెల్సియస్ పగటి ఉష్ణోగ్రత నమోదు కాగా, కౌటాల 40.3, సిర్పూర్(టి) 40.2, వాంకిడి 40.2, లోనవెల్లిలో 40.1 డిగ్రీలుగా నమోదైంది. జిల్లాలోని ఐదు మండలాలలో అలర్ట్ జోన్‌లో ఉన్నాయి.

ఉచిత శిక్షణ.. భవితకు రక్షణ

- నేటి నుంచి కాగజ్‌నగర్‌లో పాలిసెట్ కోచింగ్
- మూడేళ్లుగా కొనసాగుతున్న ఉచిత శిక్షణ
- ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

కౌటాల(సిర్పూర్): అడవుల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ పేద కుటుంబాలకు చెందిన వారే.. చాలామంది పదో తరగతి తర్వాత ఏం చేయాలో తెలియక ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయం, ఇతర పనులకు వెళ్తుంటారు. ఉద్యోగావకాశాలు ఉన్న కోర్సులపై దృష్టి సారించలేక, కోచింగ్‌కు వెళ్లే స్తోమత లేక అర్ధంతరంగా చదువు మానేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రవేశ పరీక్షలకు కోచింగ్ అందించడం తల్లిదండ్రులకు సైతం భారంగా మారింది. రూ.వేలల్లో ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చదువుకు పేదరికం అడ్డుకావొద్దనే సదుద్దేశంతో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో ఉచిత పాలిసెట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందిస్తున్నారు.

నేటి నుంచి తరగతులు ప్రారంభం

జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి కాగజ్‌నగర్‌లోని డీఆర్సీ భవనంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత పాలిసెట్ కోచింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు శిక్షణ కోసం కాగజ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డీఆర్సీ భవనంలో ఏర్పాట్లు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ ప్రాంతాల్లోని విద్యార్థులు తరగతులకు హాజరుకానున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కె.మధుకర్(డీఎస్‌వో), ఎం.శ్రీశైలం(ఎస్‌ఏ), ఎండీ సబీర్(ఎస్‌ఏ), శాంతికుమార్(ఎస్‌ఏ), డి.మోహన్(ఎస్‌ఏ), టి.వెంకటరమణ(ఎస్‌ఏ), ఎం.తిరుపతయ్య(ఎస్‌ఏ), టి.శ్యాంసుందర్(ఎస్‌ఏ) తరగతులు బోధించనున్నారు. నలభై రోజుల పాటు విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించి శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహిస్తారు. మెటీరియల్‌ను సైతం ఉచితంగా అందిస్తారు. వారానికి గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ఉన్నతాధికారులు సైతం శిక్షణ కేంద్రాన్ని సందర్శించి సలహాలు, సూచనలు అందిస్తూ తరగతులు బోధిస్తారు. పేద విద్యార్థులు కోచింగ్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్ మధుకర్ కోరారు.

మూడేళ్లుగా శిక్షణ తరగతులు

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన పేద విద్యార్థుల కోసం మూడేళ్లుగా కాగజ్‌నగర్ పట్టణంలో ఉచితంగా పాలిసెట్‌తో పాటు టీజీఆర్‌జేసీ, ఎంజేపీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ, ఇతర ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. ఏటా 150 మందికి అవకాశం కల్పిస్తున్నారు. 2022లో కోచింగ్ తరగతులు ప్రారంభించగా మొదటి ఏడాది 90 మంది విద్యార్థులు కోచింగ్ తరగతులకు హాజరయ్యారు. అందులో 65 మంది ఆయా కోర్సుల్లో సీట్లు సాధించారు. 2023లో 108 మంది విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరు కాగా అందులో 98 మంది విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించి ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు సాధించారు. 2024లో మొత్తం 150 మంది విద్యార్థులకు 132 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా 150 మందికి శిక్షణ అందించనున్నారు. రూ.వేలు ఫీజులు చెల్లించి కార్పొరేట్ సంస్థల్లో శిక్షణ పొందలేని పేద విద్యార్థులకు ఉచితంగా అత్యున్నత నాణ్యత, ప్రమాణాలతో తరగతులు నిర్వహిస్తున్నారు.

సులభ పద్ధతిలో బోధన



పాలిసెట్‌లో ర్యాంకు రావడానికి కోచింగ్ ఎంతో ఉపయోగపడింది. పోటీ పరీక్ష ఏ విధంగా ఉంటుంది. ఎలా సన్నద్ధం కావాలి? అనే విషయాలను సులభ పద్ధతిలో అవగాహన కల్పించారు. సందేహాలు నివృత్తి చేస్తూ పోటీ పరీక్షకు సిద్ధం చేశారు. గతేడాది పాలిసెట్‌లో 714 రాంక్ సాధించి హసన్‌పర్తిలోని టీజీఆర్‌జేసీ కళాశాలలో సీటు సాధించా.

– ఎస్.నాగప్రణతి, కాగజ్‌నగర్

ఉన్నత స్థానానికి చేరడమే లక్ష్యం



టీఎస్ఆర్‌జేసీ పోటీ పరీక్షకు ఏవిధంగా సన్నద్ధం కావాలో తెలియని నాకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడింది. తరగతులకు క్రమం తప్పకుండా హాజరయ్యా. ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలు, సూచనలతో టీఎస్ ఆర్‌జేసీలో సీటు సాధించి ఇంటర్మీడియెట్ పూర్తి చేశా. ప్రస్తు తం నీట్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్నా. ఉన్నత స్థానానికి చేరాలన్నదే నా లక్ష్యం.

– ఎస్.దీప్తి, కాగజ్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి



పేదరికం ప్రతిభకు ఆటంకం కాకూడదు. దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ సంస్థల్లో చేరలేని విద్యార్థులకు పాలిసెట్ ఉచిత కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుంది. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో కోచింగ్ ఇప్పిస్తాం. పాలిసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి ప్రభుత్వ కళాశాల్లో సీటు సాధిస్తే అధిక ఫీజులు లేకుండా పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. పదో తరగతి తర్వాత ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడుతారు. 150 మంది విద్యార్థులకు కోచింగ్ ఇస్తాం. ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ఇతర వివరాలకు 9441140434 నంబర్‌లో సంప్రదించాలి.

– కటకం మధుకర్, కోఆర్డినేటర్, కాగజ్‌నగర్

ఎఫ్‌ఏలపై పనిభారం!

- కొత్త పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలేవి..?
- ఎనిమిదేళ్లుగా పాతవారికే బాధ్యతలు
- జనవరి నుంచి అందని వేతనాలు
- జిల్లాలో జోరుగా సాగుతున్న ఉపాధిహామీ పనులు



కెరమెరి మండలం గోయగాంలో పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): కాంగ్రెస్ సర్కారు ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధిహామీ పనిదినాలు చేసిన భూమి లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2025– 26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే ఫీల్డ్ అసిస్టెంట్లపై తీవ్ర పనిభారం పడుతోంది. కూలీలకు పనులు చూపడం, మస్టర్ల కేటాయింపు, జాబ్‌కార్డుల జారీలో ఎఫ్ఏలు కీలకంగా పనిచేస్తున్నారు. కానీ కొత్త పంచాయతీల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాత వారే అన్ని బాధ్యతలు చూసుకోవాల్సి వస్తోంది. ఒక్కొక్కరు రెండు, పంచాయతీల విధులు నిర్వర్తిస్తుండటంతో పర్యవేక్షణ తగ్గుతోంది. అదనపు భారం మోస్తున్నా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందడం లేదని, జనవరి నుంచి వేతనాలు కూడా చెల్లించడం లేదని ఎఫ్ఏలు వాపోతున్నారు.

335 జీపీలకు 171 మంది..

రాష్ట్ర ప్రభుత్వం 2019లో మేజర్ పంచాయతీలను విడదీసి, 500లకు పైగా జనాభా కలిగిన తండాలు, గూడేలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పంచాయతీలను యూనిట్‌గా తీసుకుని కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీకి ఒక్కరు చొప్పున విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. ప్రస్తుతం జిల్లాలో కేవలం 171 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అనేక మండలాల్లో రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు ఒక్కరే చూస్తున్నారు. గత ప్రభుత్వం ఎఫ్ఏలు సమ్మె చేసిన సమయంలో తొలగించి మళ్లీ విధుల్లోకి తీసుకుంది. ఎనిమిదేళ్లు దాటినా కొత్త నియామకాలు చేపట్టలేదు. దీంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు.

తగ్గిన పర్యవేక్షణ.. పెరిగిన పనిభారం

జిల్లాలో మొత్తం ఉపాధిహామీ జాబ్‌కార్డులు 1.23 లక్షలు ఉండగా, యాక్టీవ్ కార్డులు 9,1000 ఉన్నాయి. అలాగే కూలీలు 2.43 లక్షలు మంది ఉండగా, ప్రస్తుతం 1.70 లక్షల మంది పనులకు వెళ్తున్నారు. 2025– 26 ఆర్థిక సంవత్సరంలో 44,33,227 పనిదినాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతున్నా కొత్త గ్రామ పంచాయతీల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ తగ్గుతోంది. సకాలంలో పనులు పూర్తిచేయకపోవడం, పనిచేసిన వారికి డబ్బులు జమ కాకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారులు పంచాయతీ నిర్వహణ చూస్తున్నారు. ఉపాధిహామీ పనులు నిర్వర్తించే ఎఫ్ఏలు.. ఓవైపు స్పెషల్ ఆఫీసర్లు, ఈజీఎస్ ఉన్నతాధికారుల మధ్య నలిగిపోతున్నారు. గ్రేడ్ 1 ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.12,200, గ్రేడ్ 2 వారికి రూ.10,120, గ్రేడ్ 3 వారికి రూ.9,100 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. కానీ జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వేతనాలు ఇంకా అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇబ్బందికరంగా మారింది



ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామ పంచాయతీలు కేటాయించడంతో విధులకు న్యాయం చేయలేకపోతున్నాం. ఒకే సమయంలో రెండు, మూడుచోట్ల పనులు చేయించడం ఇబ్బందికరంగా మారింది. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి. తమపై పనిభారం తగ్గించాలి.

– బోయారే రమేశ్, ఎఫ్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉన్నవారితోనే పనులు చేయిస్తున్నాం

కొత్త పంచాయతీల్లో నూతనంగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం నుంచి రాలేదు. దీంతో ప్రస్తుతం ఉన్నవారితోనే పనులు చేయిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు లేకుండా అదనపు బాధ్యతలు అప్పగించాం.

– దత్తారావు, డీఆర్‌డీవో

నేడు 'అసర్' పరీక్ష

- ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో సర్వే
- జిల్లాలో 72 పాఠశాలలు ఎంపిక
- హాజరు కానున్న 3, 4, 5వ తరగతుల విద్యార్థులు



అసర్ పరీక్షకు ఎంపికైన సావర్‌ఖేడా పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): గతంలో నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) ఆధారంగా జిల్లాలో అనేక పాఠశాలల విద్యార్థులు చదవడంతోపాటు చతుర్విధ ప్రక్రియల్లో ఏ స్థాయిలో ఉన్నారో తేలింది. ప్రస్తుతం పరిస్థితిలో ఏమైనా మార్పు వచ్చిందా.. కనీస సామర్థ్యాలతోపాటు చతుర్విధ ప్రక్రియల్లో మెరుగుపడ్డారా.. తదితర విషయాలు తెలుసుకునేందుకు నీతి ఆయోగ్ పిరమిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్యువల్ నేషనల్ ఎండ్‌లైన్ రిపోర్ట్(అసర్) సర్వే(పరీక్ష) నిర్వహించనున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో ఎంపిక చేసిన 72 పాఠశాలల్లో నేడు పరీక్ష జరగనుంది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీసీవోలకు జూమ్ మీటింగ్ నిర్వహించి పరీక్ష విధానంపై అవగాహన కల్పించారు.

30 శాతం మంది విద్యార్థులకు..

మూడు మండలాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అసర్ పరీక్ష రాయనున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేవలం 30 మందిని మాత్రమే ఎంపిక చేశారు. ర్యాండమ్‌గా పిల్లలను ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. అంటే.. ఒక పాఠశాలలో పది మంది ఉంటే ముగ్గురు మాత్రమే పరీక్షలు రాయనున్నారు. తెలుగు, గణితం సబ్జెక్టుల్లో పరీక్ష కొనసాగనుంది. అన్ని తరగతులకు ఒకే రకమైన ప్రశ్నపత్రం ఉంటుంది. తెలుగులో పదాలు, రెండు అక్షరాల పదాలు, సరళ పదాలు, వాక్యాలు గుర్తించాలి. గణితంలో అంకెలు, సంఖ్యలు, తీసివేత, భాగాహారం చేయాల్సి ఉంటుంది. ఒక్కో విభాగంలో విద్యార్థి రాణిస్తున్నాడు.. అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. 20 నిమిషాల సమయం కేటాయిస్తారు. అనుమానాలు నివృత్తి చేసేందుకు సీఆర్‌పీ, ఎంఐఎస్, సీసీవోలు ఉంటారు. ఎంఈవోలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.

ఏర్పాట్లు చేశాం



అసర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆయా పాఠశాల హెచ్‌ఎంలతో పాటు ఎంఈవోలు, ఎంఆర్సీ, సీఆర్సీ సిబ్బందికి అవగాహన కల్పించాం. కనీస సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. దేశంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏ స్థానంలో ఉందో ఈ పరీక్ష ద్వారా తెలుస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో తప్పకుండా ఈ పరీక్షలు నిర్వహించాలి.

– ఉప్పులేటి శ్రీనివాస్, క్వాలిటీ కోఆర్డినేటర్, విద్యాశాఖ

'రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం'



జిల్లాకేంద్రంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వన్ నేషన్– వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, మండల అధ్యక్షులు సుంకరి పెంటయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, నాయకులు ప్రసాద్‌గౌడ్, శ్రీకాంత్, దీపక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్‌సిల్క్‌కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు పార్టీ జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల పోరాటాలతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోలార్ షాక్‌తో ఒకరు మృతి


బాపూజీ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: సోలార్ షాక్ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇప్పల్ నవేగాం గ్రామానికి చెందిన నికురే బాపూజీ (38) తన ఎద్దులు ఇంటికి రాకపోవడంతో శనివారం రాత్రి గ్రామ శివారులోని పొలాల్లోకి వెళ్లాడు. తెల్లారినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బాపూజీ కోసం వెతుక్కుంటూ వెళ్లగా అదే గ్రామానికి చెందిన రాథోడ్ వివేక్‌కుమార్ పొలం వద్ద సోలార్ వైర్లకు తగిలి మృతిచెంది ఉన్నాడు. బాపూజీకి భార్య భీంబాయి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

యువకుడు అదృశ్యం


అనిల్

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి మద్దిమాడకు చెందిన యువకుడు సంద్ర అనిల్ అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై కథనం మేరకు అనిల్ ఈనెల 4న తన అన్న అశోక్ వద్దకు ర్యాలీ గఢ్‌పూర్ వెళ్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి


ఎద్దు కళేబరం

భీమిని: కన్నెపల్లి మండలంలోని పోలంపల్లి శివారులో ఆదివారం విద్యుత్‌షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది. భీమిని మండలంలోని వీగాం గ్రామానికి చెందిన సూర మల్లయ్య అనే రైతుకు చెందిన రెండు ఎద్దులు పోలంపల్లి పంట పొలాల వైపునకు మేతకు వెళ్లాయి. ఈక్రమంలో ఒక ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కాడెద్దు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.


చికిత్స పొందుతూ మహిళ మృతి


మాన్కుబాయి (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్‌కు చెందిన కనక మాన్కుబాయి (54) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మాన్కుబాయి గత ఫిబ్రవరి 25న తన కిరాణా షాపులో దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

ఇక మహిళలు సేఫ్!

- అందుబాటులో టీ -సేఫ్ యాప్
- అతివల రక్షణకు పోలీస్‌శాఖ చర్యలు
- ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్‌కు అవకాశం



పోలీస్‌శాఖ రూపొందించిన టీ -సేఫ్ యాప్

నిర్మల్‌ఖిల్లా: ప్రతీరోజు ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల జర్మనీ యువతిపై రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జరిగిన అత్యాచార ఘటన ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ టీ-సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళల రక్షణ కోసం ఈ యాప్‌ను రూపకల్పనచేసి దాదాపు ఏడాది గడుస్తున్నా సరైన అవగాహన లేక యాప్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మహిళలు దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు టీ -సేఫ్ యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇలా చేస్తే సేఫ్..

మొబైల్‌లో ప్లేస్టోర్ ద్వారా టీ- సేఫ్ యాప్ అని టైప్ చేసి సెర్చ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన యాప్ కనిపిస్తుంది. దీన్ని డౌన్‌లోడ్ చేసుకొని పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసి రిజిస్టర్ అవ్వాల్సి ఉంటుంది. హెల్ప్ సిటిజన్ విభాగంలో క్లిక్ చేసి ప్రయాణిస్తున్న ప్రాంతం పేరు ప్రయాణించే వాహనం, దాని రిజిస్ట్రేషన్ నంబరు నమోదు చేయాలి. ఒకవేళ రైలు ప్రయాణం చేస్తే ఆ రైలు రూట్ నంబర్ ఎంటర్ చేయాలి. అనంతరం ప్రయాణం ప్రారంభించే ముందు స్టార్ట్ బటన్ నొక్కగానే సదరు సమాచారం పోలీసుల పర్యవేక్షణలోకి వెళ్తుంది. ఇక అప్పటి నుంచి ఆ వాహనం లొకేషన్ గమ్యం చేరేవరకు పోలీసుల పర్యవేక్షణలో ఉంటుంది.

అనుకోని ఘటన ఎదురైతే..

ప్రయాణిస్తున్న వాహనం రూటు మారినా, ప్రామాణిక సమయానికన్నా ఆలస్యమైనా పోలీసుల నుంచి ప్రతీ ఐదు నిమిషాలకు ఒకసారి హెచ్చరిక సందేశం వస్తుంది. దానికి వినియోగదారు నుంచి రిప్లయ్ ఇవ్వకుంటే కేసును అనుమానాస్పదంగా పరిగణించి నేరుగా ప్రయాణిస్తున్న వాహనం వ్యక్తి వివరాలు డయల్ 100కు వెళ్తాయి. లొకేషన్ ఆధారంగా సమీప పోలీస్‌స్టేషన్ లేదా పెట్రోలింగ్ వాహనానికి సమాచారం చేరవేస్తారు. నిమిషాల వ్యవధిలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని పరిస్థితిని బట్టి అవసరమైన చర్యలు తీసుకుంటారు. అనుకోని సందర్భాల్లో విపత్కర పరిస్థితుల్లో ఇబ్బందులు పడే మహిళలను పరిరక్షించేందుకు టీ సేఫ్ యాప్ చక్కగా ఉపయోగపడుతుందని ఒంటరి మహిళలకు, యువతులకు రక్షణ కవచంలా పని చేస్తుందని జిల్లా పోలీసులు పేర్కొంటున్నారు.

బిలోలిలో కుస్తీ పోటీలు


కుస్తీపోటీలో తలపడుతున్న మల్లయోధులు

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. తానూర్, ముధోల్, లోకేశ్వరం మండలాలతో పాటు మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుస్తీ పోటీల్లో నాందేడ్ జిల్లా బోర్‌దండీ గ్రామానికి చెందిన సాయినాథ్ అనే మల్లయోధుడు ప్రథమ బహుమతి రూ.5001లు అందుకున్నాడు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లోకేశ్వరం ఏఎస్సై దిగంబర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. నాయకులు కాంతారావు, నర్సింగ్‌రావు, ప్రభాకర్ రావు, సతీశ్‌రావు, రాజశేఖర్‌రావు, లింగారావు, సుకుమార్‌రావు, రవీందర్‌రావు, ముత్యం, నాగారావు, భూమరావు, శ్రీనివాస్‌రావు, రాజు, రాజన్న, ఈరన్న, మనోహర్‌రావులు ఉన్నారు.

బైక్‌లో దూరింది.. హడలెత్తించింది!


నాగుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ వినీల్

నిర్మల్‌ఖిల్లా: ద్విచక్రవాహనంలో దూరిన విషసర్పం కొన్ని గంటలపాటు హడలెత్తించింది. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రం సమీపంలోని ముక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే ఉద్యోగి సాగర్‌కు చెందిన బైక్ డోమ్‌ను ఆనుకొని నాగుపాము దాక్కుంది. బయటకు వెళ్లేందుకు యజమాని బైక్ స్టార్ట్ చేయగా అందులో దాగి ఉన్న విషసర్పం కన్పించడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్నేక్ క్యాచర్ గిరిగంటి వినీల్‌కు సమాచారం అందించారు. ఆయన అక్కడకు చేరుకుని చాకచక్యంగా ప్రాణాలతోనే పామును పట్టుకున్నాడు. పాముకు హాని కలిగించకుండా సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువతను ప్రోత్సహించేందుకు చెస్ పోటీలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ

బాసర: గ్రామీణ యువత, విద్యార్థుల్లో చెస్ ఆటను ప్రోత్సహించేందుకు క్యాంపస్‌లో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. ఆదివారం ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో రెండు రోజుల చెస్ పోటీలను డా. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్‌తో జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెస్ నెట్‌వర్క్ సంస్థ, హైదరాబాద్‌లోని గ్యాప్‌స్కిల్స్ లెర్నింగ్ సొల్యూషన్స్ మద్దతుతో టోర్నమెంట్ నిర్వహిస్తోందన్నారు. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ నేటి విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వంటి వాటిని పక్కన పెట్టి చెస్ ఆడాలన్నారు. ఆటల వల్ల ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. చెస్ నెట్‌వర్క్ బృంద సభ్యులు సంజయ్ గజ్జల, అధ్యక్షుడు హరి, ప్రధాన కార్యదర్శి రాజన్న, కిరణ్, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ వేళ విషాదం..!

- దైవదర్శనానికి వెళ్తూ విద్యార్థి దుర్మరణం
- బైక్‌ను ఢీకొన్న టాటాఏస్


ఉదయ్ (ఫైల్)

హసన్‌పర్తి: పండుగ వేళ విషాదం చోటుచేసుకుంది. స్నేహితురాలితో కలిసి బైక్‌పై దైవదర్శనానికి వెళ్తుండగా టాటాఏస్ ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన హనుమకొండ -కరీంనగర్ ప్రధాన రహదారిపై హసన్‌పర్తి నలగట్టుగుట్ట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావుపేటకు చెందిన రామటెంకి శ్రవణ్ కుమారుడు ఉదయ్(18) హసన్‌పర్తి పరిధి అన్నాసాగరంలో అద్దెకు ఉంటూ ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి అదే కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న స్నేహితురాలితో కలిసి బైక్‌పై అన్నాసాగరం నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని నలగట్టుగుట్ట సమీపంలో హనుమకొండ నుంచి ఎల్కతుర్తి వైపునకు వస్తున్న ఓ టాటాఏస్ బస్సును అనుసరిస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఉదయ్‌తో పాటు అతని స్నేహితురాలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై దేవేందర్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయ్ మృతి చెందాడు. ఉదయ్ తండ్రి శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

కేదారేశ్వర ఆశ్రమంలో పూజలు


పూజా కార్యక్రమంలో బాలికలు

బాసర: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం బాసరలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో కన్యపూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు అతుల్ మహారాజ్ బాలికల కాళ్లు కడిగి పూజలు చేశారు. పార్వతీదేవి తొమ్మిది అవతారాలకు చిహ్నంగా తొమ్మిది మంది బాలికలకు కన్యపూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం అన్నప్రసాదం అందజేశారు. పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

టీవీషోలో గురుకుల విద్యార్థుల ప్రతిభ


గోల్డ్‌మెడల్స్‌తో విద్యార్థులు

ఇచ్చోడ: ఓ తెలుగు టీవీషోలో మండల కేంద్రంలోని గురుకుల విద్యార్థులు బంగారు పథకాలు సాధించారు. గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు ధనుశ్, వినోద్‌లు జీతెలుగు టీవీషోలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పథకాలు గెల్చుకున్నారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, బోజన్నలు విద్యార్థులను అభినందించారు.

కూరగాయలు @ కిష్టంపేట

- పందిళ్లు వేసి సాగు చేస్తున్న రైతులు
- అధిక దిగుబడులు పొందుతూ ఆదర్శం


కిష్టంపేటలో పందిళ్లపై సాగు చేస్తున్న దొండకాయ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో రైతులు ఎక్కువగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇళ్ల వద్ద పెరళ్లలో, చేలలో కూరగాయలను పండిస్తూ ప్రతీరోజు రూ.200 నుంచి రూ.300 వరకు సంపాదిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రైతులు పండించిన కూరగాయలను ప్రతీరోజు చెన్నూర్, మంచిర్యాల, గోదావరిఖని ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. మండలంలో మొత్తం 400 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తుండగా ఒక కిష్టంపేటలోనే 290 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో తీగజాతి బీర 160 ఎకరాలు, దొండ 90 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మిగతా అల్చింత, బెండ, మిర్చి, గోంగూర, తోటకూర, వంకాయలు సాగు చేస్తున్నారు.

తీగజాతి కూరగాయలపై దృష్టి..

రైతులు ఎక్కువగా తీగజాతి కూరగాయలు బీర, దొండలను సాగు చేస్తున్నారు. బీర సాగు వరి పంట పొలాల్లో గట్లలపై చేస్తుండగా పెరళ్లలో పందిళ్లు వేసి దొండసాగు చేస్తున్నారు. గ్రామంలో రైతులు సుమారు 30 ఏళ్ల నుంచి దొండ సాగు చేస్తున్నారు. తీగజాతి కూరగాయల కోసం ఎకరానికి రూ.50వేల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. పందిరి కోసం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు చేస్తున్నారు. కూలీలకు రూ.10వేల వరకు ఖర్చవుతోంది. దొండ విత్తన కొమ్మలకు సుమారు రూ.500ల వరకు ఖర్చవుతోంది. ఒకసారి తోట పెడితే 30 నుంచి 40 ఏళ్ల వరకు కాపు వస్తుంది.దొండ విత్తన కొమ్మలు పెట్టిన తర్వాత ఏడాదికి కాపుకు వస్తుంది. వారానికి సుమారు 50 కిలోల వరకు దొండకాయలు దిగుబడి వస్తాయి.వీటిని చెన్నూర్, మంచిర్యాల, గోదావరిఖని మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు..

కాగా తీగజాతి పంటలకు వారానికి రెండు సార్లు నీటి తడులు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సస్యరక్షణలో భాగంగా ప్రధాన పంటలో గడ్డి తొలగించాలి. రాలిన కాయలను ఏరివేయాల్సి ఉంటుంది. దొండ పంటకు ప్రధానంగా పండు ఈగ ఆశించి నష్టపరుస్తుంది. దీని నివారణకు అ సిఫేట్ ఎకరానికి 400 గ్రాములు లీటర్ నీటికి కలి పి పిచికారీ చేయాలి. సహజ సస్యరక్షణలో భాగంగా పండు ఈగను నివారించేందుకు రైతులు ఫిరమిన్ ట్రాప్స్ ఉపయోగిస్తున్నారు. పందిళ్ల ద్వారా తీగజాతి కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

25 ఏళ్ల క్రితం ప్రారంభించా..



నేను గత 25 ఏళ్ల క్రితం నాలుగు గుంటలలో దొండ సాగు ప్రారంభించాను. ఇప్పటి వరకు మంచి దిగుబడులు వచ్చాయి. పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటే ఉత్తమ దిగుబడులు పొందవచ్చు. – బొమ్మ రాజిరెడ్డి, రైతు

అధిక దిగుబడులు..



నేను 20 గుంటలలో దొండ సాగు చేస్తున్నాను. పందిళ్లు వేసి సాగు చేపడుతున్నాను. వారానికి 50 కిలోల వరకు పంట దిగుబడి వస్తోంది. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నా. – కుంభం రాజేశ్, రైతు

కూరగాయలూ సాగు చేయాలి..



రైతులు వరి, పత్తి, మిర్చి పంటలు కాకుండా కూరగాయలను కూడా సాగు చేయాలి. కిష్టంపేటలో చాలా మంది రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. ఎక్కువగా తీగజాతి కూరగాయలను సాగు చేస్తూ మంచి దిగుబడులు పొందుతున్నారు.– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

నిజాయతీ చాటుకున్న కండక్టర్

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కండక్టర్ ఓ మహిళ పోగొట్టుకున్న పర్సును ఆదివారం తిరిగి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ నుంచి భైంసా వెళ్లే బస్సులో పర్సు మర్చిపోయి ఓ మహిళ రాంపూర్‌లో బస్సు దిగి వెళ్లిపోయింది. గమనించిన కండక్టర్ పర్సులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా సదరు మహిళకు ఫోన్ చేసి, నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో పర్సును అందజేశారు. పర్సులో రూ.10 వేలు ఉండడం గమనార్హం. నిజాయితీ చాటుకున్న బస్సు కండక్టర్ నారాయణను డిపో మేనేజర్ కే.పండరి అభినందించారు.

మద్యం పట్టివేత

నిర్మల్‌రూరల్: మండలంలోని న్యూపోచంపాడు గ్రామంలో ఓ బెల్ట్‌షాపులో నిల్వ ఉంచిన అక్రమ మద్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని న్యూపోచంపాడు గ్రామంలో సంపంగి శివాయి అనే వ్యక్తి అనుమతి లేకుండా బెల్ట్‌షాపు నడుపుతున్నాడు. లైసెన్స్ లేకుండా అధిక మొత్తంలో మద్యం నిల్వ ఉంచాడన్న సమాచారం మేరకు బెల్ట్‌షాప్‌పై దాడి చేసి రూ.25,850 విలువ చేసే 46 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య


రమ్య మృతదేహం

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన దుర్గం రమ్య (27)అనే వివాహిత ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కాసిపేటకు చెందిన దుర్గం రాజమల్లుతో వెంకటపూర్‌కు చెందిన రమ్యకు 2016లో వివాహం జరిగింది. కొద్దిరోజుల క్రితం రాజమల్లుకు పక్షవాతం రాగా రమ్య వివిధ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. అప్పులై మనస్తాపానికి గురికాగా తండ్రి కుమ్మరి రాజన్న ధైర్యం చెప్పేవాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా రమ్య దంపతులకు ఏడేళ్ల కూతురు ఉంది. రమ్య తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నిర్మల్: సర్నాపూర్(జి) మండలంలోని చాక్‌పల్లి శివారు 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు.. చాక్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి చిన్న భోజన్న ద్విచక్ర వాహనంపై తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లి గ్రామానికి చెందిన అజయ్ కారును అతివేగంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చిన్న భోజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రున్ని 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం బాధితుడి అన్న పెద్దభోజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

హోరెత్తిన రామనామం..!


భైంసాలో శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎంపీ నగేశ్, ఎస్పీ జానకీషర్మిల


శోభాయాత్రలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీలు


నిర్మల్‌లో శోభాయాత్రలో భక్తజనం


నిర్మల్‌లో జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభిస్తున్న మహేశ్వర్ రెడ్డి


శోభాయాత్రలో పోలీసుల బందోబస్తు

భైంసాటౌన్/నిర్మల్‌టౌన్: శ్రీరామనవమి పర్వదినాన జైశ్రీరామ్ నినాదాలతో నిర్మల్ జిల్లాకేంద్రం, భైంసా పట్టణాలు మారుమోగాయి. ఆదివారం జిల్లాకేంద్రంలో హిందూవాహిని, భజరంగ్‌దళ్ సంఘాల ఆధ్వర్యంలో శ్రీరామ వీర హనుమాన్ విజయయాత్ర చేపట్టారు. స్థానిక దేవరకోట దేవస్థానం వద్ద నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకీషర్మిల ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్‌సింగ్, స్వామివివేకానంద, ఛత్రపతి శివాజీ చిత్రపటాలు శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా ఎస్పీ జానకిషర్మిల, ఏఎస్పీలు రాజేశ్ మీనా, ఉపేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. భైంసా పట్టణంలో ఉదయం 11 గంటలకు పురాణబజార్‌లోని గోశాల వద్ద రాముడి విగ్రహానికి ఎమ్మెల్యే పి.రామారావు పటేల్, ఎంపీ గోడం నగేశ్, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్‌కుమార్‌తోపాటు హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభించారు.